గ్యారెంటీలన్నీ అమలు చేశాం

- రైతు రుణమాఫీని నెరవేరుస్తున్నాం
- కాంగ్రెస్ మాటిస్తే అది శిలాశాసనం
- రుణమాఫీ నిధుల విడుదలలో సీఎం
- రుణమాఫీకి పాస్‌బుక్కే ప్రామాణికం
- అన్నదాతలు రేషన్‌కార్డుపై అపోహలు నమ్మవద్దని సూచన

లబ్ధిదారుడికి రుణమాఫీ చెక్కు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు తుమ్మల, ఉత్తమ్, పొంగులేటి, పొన్నం

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీని నిలబెట్టుకున్నదని, వాటికి తోడు రైతు రుణ మాఫీ వాగ్దానాన్ని కూడా అమలు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రైతు రుణ మాఫీ ప్రక్రియను ముఖ్యమంత్రి గురువారం సాయంత్రం సచివాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని రైతువేదికల వద్దనున్న అన్నదాతలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ.. 2022 మే 6వ తేదీన వరంగల్ డిక్లరేషన్‌లోనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రకటించారని, 2023, సెప్టెంబర్ 17న కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ ఆరు గ్యారెంటీలతోపాటు రైతు రుణమాఫీ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. హామీని మంత్రివర్గ సహచరులు, అధికారుల సహకారంతో నిలబెట్టుకున్నామని చెప్పారు. తన 16 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇది మరుపురాని రోజని వివరించారు. కాంగ్రెస్ మాటిస్తే శిలా శాసనమని, అందుకు రుణమాఫీనే నిదర్శనమని అభివర్ణించారు. మిగులు రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణలో పదేండ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ రైతు రుణమాఫీ విషయంలో విఫలమయ్యారని ఆరోపించారు. మొత్తంగా పదేండ్లలో రూ.21 వేల కోట్లకు మించి రుణ మాఫీ చేయలేదని, కానీ కాంగ్రెస్ సర్కార్ ఒకే దఫా ఆగస్టు నెల పూర్తికాక ముందే రైతుల రుణాలు రూ.31 వేల కోట్లను మాఫీ చేస్తున్నదని వివరించారు. రుణమాఫీకి పాస్‌బుక్కే ప్రామాణికమని, అపోహలను నమ్మవద్దని స్పష్టం చేశారు. రుణమాఫీకి రేషన్‌కార్డు ఉండాలనే అపోహను కొందరు సృష్టిస్తున్నారని, అవేవీ నమ్మవద్దన్నారు. రేషన్‌కార్డు కేవలం కుటుంబాన్ని గుర్తించడానికి మాత్రమేనని, రుణమాఫీకి అది ప్రాతిపదిక కాదని, పాస్‌బుక్కే ప్రామాణికమని నొక్కిచెప్పారు. భూమి ఉండి, ఆ భూమికి పాస్‌బుక్ ఉండి, పాస్‌బుక్‌పై రుణం తీసుకుంటే దానిని మాఫీ చేస్తామని వివరించారు. ఈ విషయంపై అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. రుణమాఫీకి సంబంధించి విద్య లేని, సాంకేతిక నైపుణ్యం లేని రైతులెవరికైనా సమస్యలు తలెత్తితే బ్యాంకు అధికారులను సంప్రదించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతు ఖాతాల్లోకి రుణ మాఫీ సొమ్ము చేరేలా చూడాలని కోరారు. గత ప్రభుత్వం జీతాలే సరిగా ఇవ్వలేకపోయిందని, ఆర్థిక ఇబ్బందులున్నా 8 నెలల కాలంలోనే తాము రూ.29 వేల కోట్ల విలువైన సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని, ఇప్పుడు రుణ మాఫీ చేశామని అన్నారు.

వరంగల్‌లో కృతజ్ఞత సభ

రైతు రుణమాఫీ హామీ ఇచ్చి నిలుపుకున్నందున కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గేలకు ధన్యవాదాలు తెలపాల్సిన అవసరమున్నదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. రుణమాఫీ హామీ ఇచ్చిన వరంగల్ ఆర్ట్స్ కళాశాల మైదానంలోనే కృతజ్ఞత సభ పెడతామని, ఆ సభకు రాహుల్‌గాంధీని ఆహ్వానించి, రాష్ట్ర రైతుల తరపున కృతజ్ఞతలు తెలుపుతామని వెల్లడించారు. అనంతరం రూ.లక్ష రుణ మాఫీ పొందిన 10 మంది రైతులకు సీఎం చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కట్టించిన రైతువేదికల్లో సంబురాలు

కాంగ్రెస్ ప్రభుత్వ రుణమాఫీ సంబురాలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కట్టించిన రైతువేదికలు వేదికయ్యాయి. నాడు రైతువేదికలు ఎందుకు, ఇవి ఏ మాత్రం ఉపయోగపడవని విమర్శించిన వారే నేడు వాటి వద్ద సంబురాలు జరుపుకొన్నారు. రుణమాఫీ సందర్భంగా ఆయా గ్రామాల్లోని రైతు వేదికల్లో సంబురాలు నిర్వహించాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు రైతువేదికల్లో నిర్వహించిన రుణమాఫీ సంబురాల్లో రైతులతో కలిసి పాల్గొన్నారు. ఏఈవోలు ఎంపిక చేసిన రైతులను రైతు వేదికలకు తరలించారు. కేసీఆర్ కట్టించిన సచివాలయం నుంచే సీఎం వీసీ నిర్వహించారు.

11.50 లక్షల మందికి 6 వేల కోట్ల మాఫీ

రాష్ట్ర ప్రభుత్వం తొలి దఫాలో రూ.లక్ష వరకు రుణాలను మాఫీ చేసింది. ఈ మేరకు 11.50 లక్షల మంది రైతులకు సంబంధించిన రూ. 6098.93 కోట్లను బ్యాంకులకు విడుదల చేసింది. అత్యధికంగా నల్లగొండ జిల్లా రైతులు ప్రయోజనం పొందారు. ఈ జిల్లాలో రూ.లక్ష వరకు రుణం ఉన్న 83,124 మంది రైతులకు రూ. 454.49 కోట్లు మాఫీ అయింది. ఆగస్టు 15వ తేదీలోపు రూ. 2 లక్షల రుణాన్ని మాఫీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. రూ. లక్షన్నర రుణాలను ఈ నెలాఖరు వరకు, రూ. 2 లక్షల వరకు గల రుణాలను ఆగస్టు మొదటి వారంలో మాఫీ చేస్తామని ప్రకటించింది.

రైతుబంధు పైసలు రుణమాఫీకి

> మొదటిపేజీ తరువాయి...

కేసీఆర్ సర్కార్ లక్షలోపు రుణాలను మాఫీ చేసేందుకు రూ. 16,144 కోట్లు వెచ్చించి సుమారు 35 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చిందని గుర్తుచేశారు. 2018లో అదే లక్ష లోపు రుణమాఫీకి రూ. 19,198 కోట్లు అంచనా కాగా మొత్తం లబ్ధిదారుల సంఖ్య సుమారు 37 లక్షలు అని వివరించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చినట్టు రూ. 2 లక్షల వరకు పంట రుణాలన్నీ వెంటనే మాఫీ చేయాలని, అర్హులైన రైతులందరికీ రైతుబంధు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మెడికల్ డివైజెస్ పార్క్ సంపద సృష్టించే వనరు

హైదరాబాద్‌ను మెడికల్ ఎక్వీప్‌మెంట్ల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలన్న కృతనిశ్చయంతో కేసీఆర్ సంగారెడ్డి జిల్లా సుల్తాన్ పూర్‌లో మెడికల్ డివైజెస్ పార్క్ ఏర్పాటు చేశారని, అది రాష్ట్రానికి ఎంతో సంపద సృష్టించే వనరు కానుందని కేటీఆర్ తెలిపారు. ఈ పార్క్‌లో ఏర్పాటైన సహజానంద్ మెడికల్ టెక్నాలజీస్ లిమిటెడ్ మొదటిసారిగా స్టెంట్లను ఉత్పత్తి చేసిందని, ఆ సంస్థకు సంబంధించిన స్టెంట్లు నేటి నుంచి మార్కెట్‌లో రానుండటం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో ఉత్పత్తయ్యే ప్రొడక్ట్‌లు దేశ, ప్రపంచ వ్యాప్తంగా ఎక్స్‌పోర్ట్ కానుండటం గర్వంగా ఉందని చెప్పారు.

సవాల్‌కు సిద్ధం

> మొదటిపేజీ తరువాయి...

పదవుల కోసం పెదవులు మూసుకొని కూర్చుంటే, నేను మంత్రి, ఎమ్మెల్యే పదవులను తృణప్రాయంగా భావించి రాజీనామా చేసిన. నాకు పదవులు, రాజీనామాలు కొత్తకాదు, ప్రజలకు, రైతులకు, పేదలకు, అణగారిన వర్గాలకు నా వల్ల మంచి జరుగుతుందంటే నేను ఎన్నిసార్లు పదవులకు రాజీనామా చేసేందుకైనా వెనుకాడను' అని స్పష్టం చేశారు. 'మరోసారి చెబుతున్నా.. ఆగస్టు 15 వరకు రాష్ట్రంలోని రైతులందరికీ 2 లక్షల రుణమాఫీ, ఆరు గ్యారెంటీలు (అందులోని 13 హామీలు) సంపూర్ణంగా అమలు చేసి చూపించు..'నేను రాజీనామాకు సిద్ధం, అమలు చేయని పక్షంలో నువ్వు సిద్ధమా?' అంటూ రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు.

రాములమ్మ తడబాటు.. సీఎంకు షాక్

కొల్లాపూర్: రుణ మాఫీ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం రామాపురం గ్రామంలోని రైతువేదిక వద్దకు వచ్చిన మహిళా రైతు వసంతపురం రాములమ్మ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె తడబాటుకు గురై ప్రభుత్వాన్ని పొగడటానికి బదులు కంగారులో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ ఆదాయం పోయిందని అన్నారు. ఆ వెంటనే తేరుకున్న రాములమ్మ తాను తీసుకున్న రూ. 60 వేల రుణం మాఫీ చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. తనకున్న ఎకరం పొలంలో వరి, వేరుశనగ సాగు చేస్తున్నట్టు సీఎంకు వివరించింది. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ బదావత్ సంతోష్ పాల్గొన్నారు.

బ్యాంకర్లూ.. పండుగ చేసుకోండి

- రుణమాఫీ నిధులు ఇతర అప్పులకు జమ చేయొద్దు
- రైతులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలి
- గురువారం 11 లక్షల మంది రైతులకు రుణమాఫీ
- బ్యాంకులకు 6 వేల కోట్లు విడుదల చేశాం
- బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రుణమాఫీ నేపథ్యంలో రైతులు పండుగ చేసుకుంటున్నట్టుగానే బ్యాంకర్లూ పండుగ చేసుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రైతు రుణమాఫీ కింద వచ్చిన నిధులను తిరిగి అదే రైతులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. ఈ నిధులు ఇతర అప్పులకు జమచేసి, రైతులను ఇబ్బందులు పెట్టవద్దు అని ఆదేశించారు. గురువారం ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆగస్టు నెలాఖరువరకు రైతు రుణమాఫీకి రూ.31వేల కోట్లు విడుదల చేస్తామని తెలిపారు. గురువారం సాయంత్రం 4గంటల వరకు 11లక్షలకుపైగా రైతులకు రూ.6000 కోట్ల వరకు నిధులు విడుదలైనట్టు చెప్పారు. ఈ నెలలోనే రెండో దఫాలో లక్షన్నర వరకు రుణమాఫీకి నిధులు విడుదల చేస్తామని పేర్కొన్నారు. మొత్తం 40 లక్షల బ్యాంకు ఖాతాల ద్వారా రూ.31వేల కోట్లు రుణమాఫీకి ప్రభుత్వం జమ చేస్తుందని చెప్పారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. బ్యాంకుల వద్ద తొక్కిసలాట జరుగకుండా గ్రామాల వారీగా తేదీలు ఇచ్చి రుణమాఫీని సజావుగా జరిగేలా చూడాలని బ్యాంకర్లకు తెలిపారు. రైతు రుణమాఫీ నిధులు సకాలంలో అందితే వ్యవసాయం పండుగలా మారుతుందని అభిప్రాయపడ్డారు.

ఒకేసారి.. దఫదఫాలుగా!

- ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామంటూ పత్రికల్లో భారీగా యాడ్స్
- ఆచరణలో మూడు దఫాలు
- ఇప్పుడు లక్ష. నెలాఖరుకు రూ. లక్షన్నర, ఆగస్టు 2న రూ. 2 లక్షల రుణమాఫీ

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి సర్కారు చెప్పే మాటలకు చేసే పనులకు ఎక్కడా పొంతన కుదరడం లేదు. రూ. 2 లక్షల వరకు పంట రుణాలను ఏకకాలంలో మాఫీ చేస్తున్నట్టు ప్రభుత్వం గురువారం వార్తా పత్రికల్లో ప్రకటనలు ఇచ్చింది. గురువారం సాయంత్రం వరకు రూ. లక్ష వరకు మాత్రమే మాఫీ చేస్తామని సీఎం ప్రకటించారు. ఈ నెలాఖరులోగా రూ.1.5 లక్షల వరకు, ఆగస్టులో రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామని స్పష్టంచేశారు. ప్రభుత్వ ప్రకటనలకు, సీఎం చెప్తున్నదానికి పొంతన లేకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఏకకాలంలో రూ.2 లక్షల మాఫీ అనేది అబద్ధమా? అని రైతులు నిలదీస్తున్నారు.

వరంగల్ డిక్లరేషన్‌కు తిలోదకాలు

వరంగల్‌లో నిర్వహించిన రైతు సంఘర్షణ సభలో 'వరంగల్ రైతు డిక్లరేషన్'ను రాహుల్‌గాంధీ ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఏకకాలంలో రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని, రైతులు, కౌలు రైతులకు ఎకరాకు ఏడాదికి రూ.15 వేల పెట్టుబడి సాయం అందిస్తామని హామీలు గుప్పించారు. ఆ తర్వాత ఒకే దఫాలో డిసెంబరు 9న రూ. 2 లక్షల రుణం మాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. అయితే, ఏడు నెలల తొమ్మిది రోజుల తర్వాత ఇప్పుడు మూడు దఫాల్లో రైతులకు రుణవిముక్తి కల్పిస్తామనడం రేవంత్‌కే చెల్లించింది. పంట సీజన్ మొదలై రెండు నెలలవుతున్నా రైతు భరోసా ఇవ్వకుండా నిధులను రుణమాఫీకి మళ్లించారని రైతులు ఆరోపిస్తున్నారు.

మాఫీ మాయాజాలం

> మొదటిపేజీ తరువాయి...

పడ్డారు. కొన్ని గ్రామాలకు బుధవారం రాత్రి జాబితా అందించగా, మరికొన్ని గ్రామాల్లో అయితే గురువారం మధ్యాహ్నం వరకు కూడా జాబితాను విడుదల చేస్తూనే ఉన్నారు. రుణమాఫీ జాబితా విడుదలలో ప్రభుత్వం ఎందుకో కొంత గోప్యత పాటించినట్టు తెలిసింది. అరకొర సమాచారంతో ఇవ్వడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. వాస్తవానికి ప్రభుత్వం ఫలానా జిల్లాలో గానీ, మండలంలో గానీ మొత్తం ఎంతమంది రుణాలు తీసుకున్నారు? ఒక్కొక్కరు ఎంత మొత్తం తీసుకున్నారు? ఎంతమందికి మాఫీ అయింది? ఎంత మొత్తం మాఫీ అయింది? అనే వివరాలతో జాబితా ఇవ్వాలి. కానీ ప్రభుత్వం మాత్రం కేవలం రుణమాఫీ అయిన రైతుల జాబితాను మాత్రమే విడుదల చేసింది. దీంతో జాబితాలో పేరు లేని రైతులు ఆందోళనకు గురయ్యారు. ఒక బ్యాంకు నుంచి రూ. లక్షలోపు రుణాలు గల వెయ్యిమంది రైతుల జాబితాను పంపిస్తే, 200 మంది రైతులతో జాబితా తిరిగి వెనక్కి రావడం గమనార్హం.

బ్యాంకర్ల వద్ద కూడా లేని సమాచారం

రుణమాఫీలో నెలకొన్న పలు సందేహాలు, సమస్యలకు బ్యాంకర్లు, అధికారుల వద్ద కూడా సమాచారం కరువైంది. లక్ష లోపు రుణం ఉన్నప్పటికీ తమ పేరు జాబితాలో ఎందుకు లేదంటూ ప్రశ్నించిన రైతులకు అధికారుల నుంచి మౌనమే సమాధానంగా మారింది. తమకు ఇప్పుడు ఎలాంటి వివరాలు తెలియవని, రెండు రోజులు ఆగితే అన్ని వివరాలు చెప్తామని దాటేస్తున్నారు. గతంలో ఒక రైతుకు రుణమాఫీ కాకపోతే ఏ కారణంతో కాలేదో తెలుసుకునే వెసులుబాటు ఉండేదని, కానీ ఇప్పుడు ఆ వెసులుబాటు కూడా లేదని బ్యాంకర్లు తెలిపారు.

ప్యాక్స్ రైతులకు మరో రెండు రోజులు

ఇతర బ్యాంకుల్లో రైతులకు రుణమాఫీ డబ్బులు జమవుతుండగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(ప్యాక్స్)లో జమ కాకపోవడంపై ఆ రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దీనిపై ప్యాక్స్ అధికారులను సంప్రదించగా ప్యాక్స్‌లోని రైతులకు రుణమాఫీ కావడానికి మరో రెండు మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉందని తెలిపారు. ప్యాక్స్‌లకు సంబంధించి రుణ మొత్తం సహకార బ్యాంక్ టెస్కాబ్ నుంచి డీసీసీబీల్లోని ప్యాక్స్ అకౌంట్‌లో జమవుతుంది. ప్రభుత్వం ప్రస్తుతం రుణమాఫీ మొత్తాన్ని టెస్కాబ్‌కు పంపించగా ఆ మొత్తం క్రమంగా డీసీసీబీలకు చేరుతున్నది. ఆ తర్వాత ప్యాక్స్‌లలో రైతులవారీగా వివరాలు తీసుకొని ఎవరికి ఎంత మాఫీ అయిందో తేల్చిన తర్వాత రైతుల ఖాతాల్లో రుణమాఫీ మొత్తాన్ని జమ చేయనున్నారు. కాబట్టి ప్యాక్స్‌లలో రుణం ఉన్న రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు.

రేషన్‌కార్డు నిబంధనతో అన్యాయం

రేషన్ కార్డు నిబంధనతో చాలా మంది రైతులకు అన్యాయం జరిగింది. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం గ్రామంలో ఒక కుటుంబంలో ముగ్గురు వ్యక్తులు ఒకరు రూ.60వేలు, మరొకరు రూ.70వేలు, మరొకరు రూ.90 వేల వరకు రుణాలు తీసుకున్నారు. రేషన్ కార్డు నిబంధన పెట్టి కుటుంబం యూనిట్‌గా రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తుండడంతో ఈ కుటుంబానికి తొలి విడతలో రుణమాఫీ కాలేదు. మాఫీ కావాలంటే రూ.20వేలు కట్టాల్సిన పరిస్థితి వచ్చింది.

అందరికీ కాదు.. కొందరికే

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 7,383 మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తుండగా తొలి విడతలో 2,667 రైతు కుటుంబాలకు మాత్రం రుణమాఫీ పథకం వర్తించింది. నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని 23 గ్రామాల్లో 1993 మందికి రుణమాఫీ చేశారు. మండలంలోని గ్రామాల్లో 10, 12, 22, 41 ఇలా దాదాపు 19 గ్రామాల్లో వంద కంటే తక్కువ మందికి రుణమాఫీ చేశారు. సగటున ఒక్కో గ్రామాల్లో 20 శాతం నుంచి 30శాతం మందికే రుణమాఫీ వర్తించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం చెప్తున్న లెక్కల ప్రకారం ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,53,168 మంది రైతులు ఉన్నారు. వీరిలో సిద్దిపేట జిల్లాలో 53,137 మంది, మెదక్ జిల్లాలో 48,864 మంది, సంగారెడ్డి జిల్లాలో 51,167 మందికి మాత్రమే పంట రుణాలు మాఫీ అయ్యాయి. హుస్నాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాల్లో మొత్తం 54,739 మంది రైతులు ఉండగా, 10,359 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ దక్కింది. దుబ్బాక మండలంలో 4,694 మంది, మిరుదొడ్డి మండలంలో 3,521 మంది, తొగుట మండలంలో 1,970 మంది, దౌల్తాబాద్ మండలంలో 2,961 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేట జిల్లాలో 1,67,771 మంది, మెదక్ జిల్లాలో 1,53,883 మంది, సంగారెడ్డి జిల్లాలో 1,90.002 మంది రైతులకు ఎలాంటి షరతులు లేకుండా పంట రుణమాఫీ అయ్యాయి.

కరీంనగర్ ప్యాక్స్ పరిధిలో ఒక్కరికీ కాలే

కరీంనగర్ జిల్లా జమ్మికుంట ప్రాథమిక సహకార కేంద్రం పరిధిలో ఎనిమిది గ్రామాలుండగా మొత్తం 1,016 మంది రైతులు రుణం తీసుకున్నారు. అందులో లక్ష వరకు రుణం తీసుకున్న రైతుల సంఖ్య 799 మంది కాగా, వీరు తీసుకున్న రుణం రూ.4.93 కోట్లు. లక్షపైన అప్పు తీసుకున్న రైతులు 217 మంది కాగా, వీరు తీసుకున్నది రూ. 3.90 కోట్ల పైనే. ఈ సొసైటీ పరిధిలో ఒక్కరికీ రుణమాఫీ కాలేదు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం ఎదిర గ్రామంలో 1,365 మంది రైతులు లక్షలు రుణాలు తీసుకుంటే వారిలో కేవలం 653 మందికి మాత్రమే రుణమాఫీ జాబితాలో పేర్లు వచ్చాయి.

మహబూబ్‌నగర్ జిల్లాలో 30% మందికే

మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 39,380 మంది రైతులకు సంబంధించి రూ.211 కోట్లు విడుదలైనట్టు కలెక్టర్ విజయేందిరబోయి ప్రకటించారు. రూ.లక్ష రుణాలు తీసుకున్న వారంతా సుమారు ఒక లక్ష మందికిపైనే ఉంటారని అంచనా. అయితే, వీరిలో కేవలం 30 శాతం మందికి మాత్రమే రుణమాఫీ వర్తింపజేశారు. వనపర్తి జిల్లాలో 28,408 మంది ఉండగా రూ.156.91 కోట్లు మాఫీ అయింది. గద్వాల జిల్లాలో 1.40 లక్షల మంది రైతులకుగానూ 24,398 మంది రైతులకు రూ. 144 కోట్లు విడుదలయ్యాయి. నారాయణపేట జిల్లాలో 28,684 మందికిగానూ రూ.165,45 కోట్లు మాఫీ అయింది. నల్లగొండ జిల్లా వ్యవసాయ అధికారి లెక్కల ప్రకారం 83 వేల మందికి రూ.453 కోట్ల లబ్ధి చేకూరుతుందని ప్రకటించారు. గొల్లగూడ కోఆపరేటివ్ సొసైటీలో మొత్తం 1274 మంది రైతులు రెండు లక్షల వరకు రుణాలు తీసుకోగా, వారిలో లక్ష రుణాలు పొందిన 500 మందికి మాఫీ అయింది. సంస్థాన్ నారాయణపురం మండలం గుజ్జ సహకార సొసైటీలో 117 మంది లక్ష లోపు రుణాలు తీసుకున్న వారు ఉన్నారు. వీరిలో ఎంత మందికి రుణమాఫీ వర్తించిందనేదానిపై సాయంత్రానికి కూడా స్పష్టత లేకుండా పోయింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి ఎల్‌పీఎస్ పరిధిలో 777 మంది లక్ష రూపాయల్లోపు పంట రుణాలు తీసుకున్న రైతులు ఉన్నారు. 555 మందికి రుణమాఫీ అయింది.

యువరైతు ఆత్మహత్య

నర్మెట, జూలై 18: అప్పుల బాధలు తాళలేక ఓ యువరైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం జనగామ జిల్లా నర్మెట మండలం కన్నెబోయినగూడెంలో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన తోడేటి సాంబరాజు (29) తనకున్న 3.5 ఎకరాల భూమిని వ్యవసాయానికి అనుకూలంగా మార్చాడు. అందులో సుమారు 3 బోర్లు వేయగా ఒక్క బోరు మాత్రమే కొద్దిగా నీరు పోస్తున్నది. మూడు బోర్లకు, పంట పెట్టుబడికి సుమారు రూ.10 లక్షల వరకు అప్పు లయ్యాయి. చేసిన అప్పులు ఎలా తీర్చాలో దారిలేక తీవ్ర మనస్తాపం చెంది ఈ నెల 16న పురుగుల మందు తాగాడు. దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

'అడంగల్' అన్నదాతల ఆశలు ఆవిరి

చుంచుపల్లి, జూలై 18: ఊహించినదే అయింది. కర్షకుల రుణమాఫీకి కొర్రీలమీద కొర్రీలు పెట్టిన కాంగ్రెస్ సర్కారు కొత్తగూడెం సహకార సంఘంలో కర్షకులకు కొత్త చిక్కు తెచ్చిపెట్టింది. ఇప్పటికే పట్టాదారు పాస్‌పుస్తకాలు, రేషన్‌కార్డులు అంటూ ఎడాపెడా నిబంధనలు పెడుతూ వచ్చిన రేవంత్ ప్రభుత్వం రుణమాఫీ రైతుల్లో వీలైనంతమందిని తొలగించాలని నిర్ణయించుకున్నట్టుగా ఉంది. పట్టాదారు పాస్ పుస్తకం లేదన్న కారణంగా అనేక మంది రైతులను రుణమాఫీ నుంచి పక్కకు తప్పించింది. కొత్తగూడెం సహకార సంఘం బాధ్యులు తమ సొసైటీ పరిధిలో మొత్తం 3,140 మంది రైతులకు రూ.12.71 కోట్ల పంట రుణాలను మంజూరు చేశారు. వీరిలో 720 మంది రైతులకు పట్టాదారు పాస్‌బుక్కులు లేకపోవడంతో కేవలం పహాణీల మీదనే పంట రుణాలు ఇచ్చారు. అర్హులైన రైతుల వివరాలు పంపాలని ప్రభుత్వం కోరడంతో మొత్తం జాబితా పంపారు. కానీ, గురువారం ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ అర్హుల జాబితాలో 720 మంది రైతుల పేర్లు లేవు. పట్టాబుక్కు లేదన్న కారణంతోనే రుణమాఫీ అర్హుల జాబితాలోంచి ప్రభుత్వం వీరిని తొలగించింది.

హరీశ్‌ను రాజీనామా అడిగే హక్కు లేదు

- రాజీనామాల చరిత్ర బీఆర్ఎస్‌ది
- బీఆర్ఎస్ నేత దేవీ ప్రసాద్ డిమాండ్

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ) : మాజీ మంత్రి హరీశ్‌రావును రాజీనామా చేయాలని అడిగే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదని, వందరోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని, గత డిసెంబర్ 9నాటికే రైతులకు రెండు లక్షల వరకు సంపూర్ణ రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ అన్ని వర్గాల ప్రజలను వంచించిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దేవీప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఆరు గ్యారెంటీలకు మొదటి అసెంబ్లీ సెషన్‌లోనే చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన రాహుల్ గాంధీ మాటలు బుట్టదాఖలయ్యాయని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్ట్ 15లోగా అమలు చేస్తామని మరోసారి ప్రజలను మోసం చేసే ప్రయత్నాన్ని ప్రజాపక్షం వహించిన హరీశ్‌రావు అడ్డుకున్నారని, ఆరు గ్యారెంటీలతో పాటు రెండు లక్షల రుణమాఫీ చేయకుంటే సీఎం రాజీనామా చేయాలని, అమలు చేస్తే తాను రాజీనామా చేస్తామని హరీశ్ ప్రకటించారని వివరించారు. నాడు చాలెంజ్‌కు ముందుకు రాని ముఖ్యమంత్రి, ఆ చాలెంజ్ వల్ల అనివార్యంగా ఇప్పుడు కేవలం లక్ష వరకు అదీ కొందరికే లబ్ధికలిగేలా 6వేల కోట్లు మాత్రమే వేసి సంబురాలు జరుపుకోవడం హాస్యాస్పదంగా ఉన్నదని ఎద్దేవాచేశారు. ఇంకా 25 వేల కోట్ల రుణమాఫీ, ఆరు గ్యారెంటీలను సంపూర్ణంగా అమలు చేయకుండా హరీశ్‌రావును రాజీనామా చేయాలని సీఎం, ఇతర కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేయడం ప్రజాపక్షంగా నిలబడే హరీశ్‌రావుపై వారికున్న అక్కసును తెలియజేస్తున్నదని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం పదవులకు రాజీనామా చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని, ఇప్పటికైనా హామీలను కోతలు లేకుండా అమలుచేయాలని సూచించారు. అమలు చేసి అన్నీ అమలు చేశామనే దబాయింపును ఇకనైనా ఆపాలని, కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలుచేసే దాకా ప్రశ్నిస్తూనే ఉంటామని, ప్రజల పక్షాన పోరాడుతామని ప్రకటించారు.

నేతన్నల రుణాలూ మాఫీ చేయాలి

రైతుల రుణమాఫీ మాదిరిగానే చేనేత సహకార సంఘాలు, కార్మికుల వ్యక్తిగత రుణాలనూ మాఫీ చేయాలని చేనేత కార్మికసం